# ప్రేమ చరిత్రలో ఓ పుట

"కీర్తనంటే నాకు ఎంతో ఇష్టం. కేవలం ఇష్టమే కాదు. ఆమె అంటే నాకు ప్రాణం. కీర్తన లేనిదే నాకు జీవితం లేదు. కీర్తనే నా సర్వస్వం. కీర్తనను నేను ఇంతగా ఇష్టపడుతున్నది తన లోనెక్ జాకెట్లో నుంచి కవ్విస్తూ కనిపించే ఎత్తయిన గుండెల్ని చూసి కాదు, ఆమె నవ్వినప్పుడు ముత్యాల్లా మెరిసే పలువరసలోని ఆకర్షణకూకాదు, మత్తెక్కించే ఆమె పెదాల విన్యాసాలు చూసీ కాదు. కంటి చివరల నుంచి చూసే ఓరచూపులకూ కాదు, చిరు దరహాసాలకు తట్టుకోలేకనూ కాదు. కేవలం కీర్తన మనసు, మంచితనం నన్ను ఆకర్షించాయి, ఆకట్టుకున్నాయి... అఫ్‌కోర్స్ పైన చెప్పిన ఆమె అందాలకు నేను వివశుడిని కాకపోలేదు. కాని వాటిని చూసి - ఆ అందాల మీది మోజుతో మాత్రం నేను ఆమెను కోరుకోవడం లేదు."

సరిగ్గా నాలుగు సంవత్సరాల క్రితం కీర్తన మీద తనకున్న ఇష్టాన్ని అలా నా ముందు వ్యక్తం చేసిన ప్రదీప్ ఇప్పుడు ... ఇలా.. అప్రయత్నంగా అతను రాసిన ఉత్తరాన్ని మరోసారి చదవసాగేను.

"డియర్ వినోద్!

ఇటీవలి వరకు నేను రాస్తున్న క్షేమ సమాచారాలకు భిన్నంగా, ఎంతో కాలంగా నీకు రాయాలనుకుంటున్న ఓ ముఖ్య విషయం రాస్తున్నాను. మరి ఎవ్వరితోనూ చెప్పలేని విషయాన్ని నీ ఒక్కడికే చెప్పుకుంటున్నాను. ఎందుకో తెలుసా? సహృదయంతో అర్థం చేసుకుని ఆలోచించగలవని, నా సమస్యకు సరైన పరిష్కారం సూచించగలవనీ నమ్మకంతో రాస్తున్నాను.

"కీర్తనను నేను ఎంతగా ఇష్టపడతానో నీకు తెలిసిన విషయమే. మా ఇద్దరి పెద్దవాళ్ళకు మా పెళ్ళి ఇష్టంలేక పోయినా వారి నెదిరించి వివాహం చేసుకున్నాం కదా! ఈ నాలుగు సంవత్సరాలుగా వాళ్ళు ఎవ్వరూ మా ఇంటికి

రావడం కాని, మేము వారి ఇళ్ళకు వెళ్ళడం గానీ జరగలేదు. అందుకు నేను ఎన్నడూ బాధపడలేదు.

"గౌరవం, మర్యాద, అనురాగం, ఆత్మీయత ఎదుటి వారికి మనం ఇస్తున్నట్లుగా నటించడం తెలికేమో గాని మనం ఎదుటివారి నుంచి పొందుతున్నాం అని మనల్ని మనమే మభ్యపెట్టుకోవడం అంత తేలిక్కాదు.

"మా కష్ట సుఖాల్ని కనుక్కుంటూ అవసరమైన ప్రతిసారీ సహాయ సహకారాలందిస్తున్న ఆప్తుడివీ, ఆత్మీయుడివీ నీవు ఒక్కడివే. అందుకే నా సమస్యను నీ ముందుంచుతున్నాను. నువ్వు చెప్పే ఏ పరిష్కారాన్నైనా అంగీకరిస్తాను.

"కారణం అంతుపట్టడం లేదు కానీ కీర్తన ప్రవర్తనలో ఈ మధ్య చాలా మార్పు వచ్చింది. నన్ను సరిగ్గా అర్థం చేసుకోవడం లేదు. అర్థం అయ్యేటట్లు నేను చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమే అవుతున్నాయి. ఆమెలో ఏదో నిర్లిప్తత. పిల్లలు పుట్టకపోతే ఆడ వారికి సహజంగా నిరాశ, నిరుత్సాహం కలుగుతాయి. భగవంతుడు బంగారం లాంటి పాపను ప్రసాదించాడు. కాబట్టి కీర్తన నిర్లిప్తతకు అది కారణం కాదు. ఏది ఏమైనా ఆమె ఇది వరకులా నాతో మనసు విప్పి మాట్లాడడం లేదు. నాకు ఇష్టం లేని నిరాశా, నిస్పృహలతో గడుపుతున్నది.

"ఆమె ప్రవర్తన రోజు రోజుకీ నాలో అసంతృప్తిని పెంచుతున్నది. ఆవేదనకి గురి చేస్తున్నది. ఆవేశం కలిగించిన సందర్భాలు కూడా లేకపోలేదు. కానీ కీర్తన మీద నాకున్న ఇష్టం మూలంగా నా ఆవేశాన్ని అతి కష్టం మీద అదుపు చేసుకున్నాను. చాలా కాలంగా ఓర్పు చూపిస్తున్న నాకు అసహనం ఆరంభమైంది. నా అసహనం హద్దు దాటక ముందే నీవు చొరవ చేసుకుని సమస్య పరిష్కరిస్తావని ఆశిస్తున్నాను. వెంటనే బయలుదేరతావని ఆశగా ఎదురు చూస్తుంటాను.

ఇట్లు
నీ
ప్రదీప్"

ఆఫీసు పని త్వరగా పూర్తి చేసుకుని రెండు రోజులకు సెలవు శాంక్షన్ చేయించుకుని సాయంత్రానికి ఊరు బయలుదేరాను.

* * * *

నాకున్న ఒకే ఒక్క ప్రాణ మిత్రుడు ప్రదీప్. చిన్నతనం నుంచీ కలిసి ఉన్నాం. ఒకేచోట చదువుకున్నాం. ప్రదీప్ కాలేజీలో చదివే రోజుల్లో కీర్తన మీద మనసు పడ్డాడు. ఆమెనే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ప్రదీప్ తల్లిదండ్రులకు ఆమె కులం అడ్డు వచ్చింది. కీర్తన ఇంట్లో వారిక్కూడా వారి పెళ్ళి ఇష్టం లేకపోయింది. అయినా వాళ్లందరినీ వదులుకుని ఈ ఇద్దరూ ఒకట్రైపోయారు.

వారి కోరిక నెరవేరటంలో నా పాత్ర చాలా ఉన్నది. వారి పెళ్ళికి నేనే సలహాదారుడినీ, పెళ్ళి పెద్దనూ కూడా. ఆ బరువు బాధ్యతలన్నీ ప్రదీప్ నాకు అప్పగించాడు. సంతోషంగా ఆ బాధ్యతలను స్వీకరించి - విజయవంతంగా పూర్తి చేశాను.

ఉద్యోగ రీత్యా వేర్వేరుచోట్ల ఉంటున్న మేము తరచుగా కలుసుకుంటూనే ఉన్నాం. నేనే ఎక్కువసార్లు ప్రదీప్ వాళ్ళ ఇంటికి వెళ్ళాను. కీర్తన కూడా నాతో చనువుగా వుంటుంది. వారిద్దరి పెళ్ళి సజావుగా జరగడానికి నేను ముఖ్య కారణమనే కృతజ్ఞాతభావం ఆమెకున్నది. వారికి మొదటిసారిగా ఆడపిల్ల పుట్టినప్పుడు నన్ను ఆహ్వానించడం, నేను వెళ్ళి రావడం కూడా జరిగాయి. అనుకోకుండా ప్రదీప్ నుంచి ఇలా ఉత్తరం రావడం నాకు కొంత నిరుత్సాహాన్ని కలిగించిన మాట మాత్రం నిజం. నా వంతు కర్తవ్యం నిర్వర్తించేందుగ్గాను బయలుదేరాను.

* * * *

నేను ఆ ఊరు చేరేసరికి ఉదయం పది గంటలైంది. ఆ సమయానికి ప్రదీప్ ఆఫీసుకు వెళ్ళిపోయి ఉంటాడు. ఇంట్లో కీర్తన ఒక్కతే ఉండి ఉంటుంది. ఆఫీసుకు వెళ్ళి ప్రదీప్‌ను కలుసుకోవడం కంటే ఇంటికి వెళ్ళడమే మంచిదనిపించింది. ఒంటరిగా ఉన్న కీర్తనతో మాట్లాడి ఆమె మనసులోని విషయాన్ని తెలుసుకోవచ్చుననే ఉద్దేశంతో ప్రదీప్ వాళ్ళ ఇంటికి వెళ్ళాను.

"కీర్తన ప్రవర్తన నాతో ఎలా ఉంటుందో?" మనసులో అనుకున్నాను.

ఆమె మారిందనే నేనూ ఎందు కనుకోవాలి? అది కేవలం ప్రదీప్ భ్రమకావచ్చు కదా? నా ఆలోచనలకు నాకే నవ్వు వచ్చింది.

వీధి మొదట్లోనే రిక్షా దిగి నడిచి వెళ్ళాను ఇంటి దాకా. వీధి గేటు లాక్ చేసుంది. కాలింగ్ బెల్‌నొక్కాను. పని పిల్ల బయటకు పరుగెత్తుకుంటూ వచ్చింది. నన్ను చూసీ చూడగానే తుర్రున లోపలికి పరుగెత్తి తాళం చేతితో తిరిగి వచ్చింది.

"మీ అమ్మగారు ఇంట్లో లేరా?" అడిగాను.

"ఉన్నారండీ. స్నానం చేస్తున్నారు."

ఇల్లంతా ఓసారి కలియచూశాను. అదే అలంకరణ. ఫ్రిజ్ కొన్నట్లున్నాడు కొత్తగా. ఇల్లంతా ఎప్పుడూ నీట్‌గా సర్ది ఉంచుతుంది కీర్తన. మంచి అభిరుచి ఉన్న మనిషి.

ఎదురుగా గోడకు వేలాడుతున్న రాధాకృష్ణుల క్యాలండర్ చూసి ప్రదీప్, కీర్తనలను ఊహించుకున్నాను.

"ఇప్పుడే వస్తున్నారా?" అడుగుతూనే హాల్లోకి వచ్చింది కీర్తన.

"అవునమ్మా, ఇదే రావడం."

"కాళ్ళు కడుక్కురండి. ముందు భోజనం చేద్దాం."

"ఆయాం రెడీ" అంటూ కుర్చీలోంచి లేచాను.

ప్రదీప్, కీర్తనల దగ్గర నాకు ఏ మాత్రం మొహమాటం లేదు. సొంత మనుషుల మధ్యన ఉన్నట్లే ఉంటుంది. అనవసరమైన ఫార్మాలిటీస్ మా మధ్యన చోటుచేసుకోవు.

అసలు విషయం ఎలా ఎప్పుడు ప్రారంభించాలా" అని ఆలోచిస్తూనే కీర్తన చెప్పే కబుర్లన్నీ వింటూ భోజనం పూర్తి చేశాను.

ఇద్దరం హాల్లో కూర్చున్నాం.

"కీర్తనా!... ఓ మాట అడుగుతాను. నిజం చెప్పాలి" అడిగాను.

విస్మయంగా నా వైపు చూసిన కీర్తన...

"ఎప్పుడయినా నీకు చెప్పకుండా ఏ విషయం అయినా దాచి పెట్టానా అన్నయ్యా?" సూటిగా అడిగింది.

"అలాగని కాదమ్మా... ఊరికే అడిగాను."

"నిజమే చెప్తాను. అడుగన్నయ్యా" అంటూ నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది కీర్తన.

"నువ్వు ప్రదీప్‌తో ఇదివరకులా ఉండడం లేదనీ ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా ఉంటున్నావనీ ఉత్తరం రాశాడు. వాడితో మనసు విప్పి మాట్లాడడం లేదట. చనువుగా - సరదాగా ఉండడం లేదట. ఆ విషయంగా వాడు చాలా బాధపడుతూ రాశాడమ్మా. కారణం ఏమై ఉంటుందో నాకూ అంతుపట్టక ఇలా నిన్ను సూటిగా అడుగుతున్నాను. "

...... ... .... .... ....

"ఇద్దరూ కోరుకుని - కావాలనుకుని పెళ్ళి చేసుకున్నారు. జీవితాంతం ఒకరి కోసం ఒకరు, ఒకరి ఇష్టా యిష్టాల్ని తెలుసుకుంటూ వాటికి అనుగుణంగా, అనుకూలంగా బ్రతకాలని కదా అనుకున్నారు. మరిప్పుడిలా ఎందుకు వాడూ, నువ్వూ బాధపడడం?" అన్నాను మళ్ళీ నేనే.

"... ... ..."

ఒకర్నొకరం అర్థం చేసుకున్నాం. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం... అని కదా చెప్పారు పెళ్ళి చేసుకోబోయే ముందు, పెళ్ళి అయ్యే వరకే కాదు బ్రతికున్నంత కాలం ఒకర్ని ఒకరు అర్థం చేసుకుంటూనే ఉండాలి. మీ మనసుల్లో ఉండే బాధని మీ ఇద్దరూ ఒకరికొకరు చెప్పుకోకపోతే ఇంకెవరితో చెప్పుకుంటారు చెప్పు?" అనునయంగా అన్నాన్నేను.

అప్పటికే కీర్తన కళ్ళు నీటి సుడులతో నిండిపోయాయి. వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక ఒక్కసారిగా ఏడ్చేసింది కీర్తన.

ఊహించని ఈ పరిస్థితికి తట్టుకోలేకపోయాన్నేను.

"కీర్తనా!... ఏమిటమ్మా చిన్న పిల్లల్లాగా?.. చదువుకున్న దానివి, సమస్యలు వస్తే సవ్యంగా ఆలోచించుకుని పరిష్కరించుకోవాలి కానీ ఇలా బేలగా అయిపోతే ఎలా?" సముదాయింపుగా అన్నాన్నేను.

"అయినా నువ్వింతగా మనసు కష్టపెట్టుకోవలసిన అవసరం ఏమిటో అర్థం కావడం లేదు. ఏదైనా నాతో కూడా చెప్పకూడనంత ఆంతరంగికమా?"

అలాంటిదేం కాదన్నట్టు. తలాడించింది. తడి కళ్ళను తుడుచుకుంటూ.

"చెప్పు కీర్తనా... నీ బాధేమిటో చెప్పు. వాడి ప్రవర్తనలోగానీ, మాటల్లోగానీ నీకు కష్టం కలిగించేటట్లు ఉంటే ధైర్యంగా, నిర్మొహమాటంగా అడిగేయగలను చెప్పు" లాలనగా అడిగాన్నేను.

"నువ్వడిగినట్లే చెప్తాను. కానీ ఈ విషయం ఆయనకు తెలియకూడదు... తెలిస్తే బాధపడతారు... ఒక రకంగా నా మీద అసహ్యాన్ని కలిగించుకుంటారేమో కూడా?"

ఆమె మాటల్లోని అర్థం ఆలోచనలకందని నేను ఆశ్చర్యపోయాను.

"నా దిగులంతా కల్పన గురించే అన్నయ్యా" అన్నది కీర్తన మూడేళ్ళ కూతుర్ని ఉద్దేశించి.

"కల్పన గురించా? దానికేమయిందమ్మా? అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. అడిగినదల్లా సమకూరుస్తున్నారు. దానికేం తక్కువని?.. అవునూ, పాప ఆరోగ్యంగానే ఉంది కదూ?" అనుమానంగా అడిగాను.

"దానికేం? ఆరోగ్యంగానే వుంది. నా దిగులంతా దాని భవిష్యత్తు గురించి. రేపది పెద్దయ్యాక మా ఇద్దరి గురించి నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటుంటే అది సహించగలదా? సహించి మమ్మల్ని అర్థం చేసుకోగలదా? అది మమ్మల్ని అర్థం చేసుకున్నా దాన్ని పెళ్ళి చేసుకునేందుకు..."

"ఛ... ఛ.... ఇదిటమ్మా నీ సమస్య? ముక్కు పచ్చులారని మూడేళ్ళ కూతురికి పెళ్ళి ఎలా జరుగుతుందా అని దిగులుపడుతున్నావా? ఆడపిల్ల పుట్టింది పెళ్ళి చేసుకోవడానికేనా? అయినా దాన్ని చదివించి పెద్దదాన్ని చేసి, మంచి ఉద్యోగస్తురాల్ని చేయాలనే ఆలోచనలు చేయాలి కానీ - పిల్ల భవిష్యత్తంటే కేవలం పెళ్ళి చేసి పంపడమా? అయినా లోకం తెలియని ఆ పసి గుడ్డుకి పెళ్ళి గురించి ఆలోచించడమే హాస్యాస్పదంగా ఉన్నది కీర్తనా? నువ్వింత సంకుచితంగా ఆలోచించడం నాకు నచ్చలేదమ్మా" అన్నాను చిరుకోపంగా...

... ... .... ... ...

"అయినా దెప్పి పొడుస్తున్నావనుకోనంటే ఓ మాట... నీ పెళ్ళి గురించి మీ అమ్మ నాన్నలు ఎన్ని కలలు కని ఉంటారు.. వాళ్ళ కలల్ని కల్లలు చేసి ప్రేమకే ప్రాధాన్యం ఇచ్చి ప్రేమించినవాడిని పెళ్ళి చేసుకున్నావ్. వాళ్ళ గౌరవ, మర్యాదలు వగైరాలన్నీ నీ ప్రేమ తరువాతనే అనుకున్నావు. నీవుచేసిన పని తప్పని కాదు నేను అనడం"

"నీ ప్రేమ నిజమైందే అయితే ప్రేమకు నీవు అప్పుడు ఇచ్చిన ప్రాధాన్యాన్నే ఇప్పటికీ - ఎప్పటికీ ఇవ్వాలంటాను. ప్రేమ కోసం నిన్ను కన్నవారిని గురించి ఆలోచించని నువ్వు నువ్వు కన్న పిల్లల కోసం ఆలోచించడం సమంజసం కాదు. ఎవరైనా నీ ప్రేమ తరువాతనే అనుకుంటేనే, అనుకోగలిగితేనే నీది నిజమైన ప్రేమ అవుతుంది. కడుపు తీపి అనేది అందరికీ ఒకటే కీర్తనా.

"అనవసరమైన ఆలోచనలతో నువ్వు బాధపడుతూ - వాడిని బాధ పెడుతూ తిరిగి రాని కాలాన్ని వృథా చేసుకోకు. ప్రేమించిన మనిషి కోసం ప్రాణాలైనా ఇచ్చేస్తామంటారు పెళ్ళికాక ముందు. అలా పెళ్ళి అయ్యాక ఇదిగో ఇలాంటి అర్థం లేని వ్యర్థపు ఆలోచనలతో చక్కని జీవితాన్ని చిక్కుల పాలు చేసుకుంటారు.

"ఓ...కే.. నీ సమస్య ఇది అని తెలిస్తే పాపం ప్రదీప్ చాలా బాధపడతాడు. ప్రేమించడానికి, పెళ్ళి చేసుకోవడానికీ కలిసి కాపురం చేయడానికీ, ఏ ఒక్క దానికీ అడ్డంరాని తన కులం ఇప్పుడిలా... నో..నో...! అసలు వాడికి ఈ విషయమే తెలియకూడదు. ఇకనైనా ఆ ఆలోచనకు స్వస్తి చెప్పి వివేకంతో మసలుకో. వాడిని ఎప్పటిలా సంతోషపెడుతూ నీవు సంతోషంగా ఉండు.'

"నేను వెళ్ళి మీ ఇద్దరికీ కలిపి ఓ ఉత్తరం వ్రాస్తాను. కేవలం నా ఉత్తరం ద్వారానే నీవు మారినట్లు వాడు అనుకోవాలి. దయచేసి నీవు ఇలాంటి ఆలోచన చేసినట్లుగా కూడా వాడికి తెలియనీకు. తెలిస్తే పాపం ప్రదీప్ తట్టుకోలేడు.

"నా మాట వింటావు కదూ?" అంటూ చేయి చాచాను.

"తప్పకుండా!" అంటూ చేతిలో చెయ్యి వేసింది పశ్చాత్తాపంతో కీర్తన.

తృప్తిగా తిరుగు ప్రయాణం అయ్యాను.

◆ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 3.10.1990 ◆